క్లుప్తంగా

మొగిలి వెంకటగిరిలో గంగమ్మ జాతర



అంబలి సమర్పిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వెంకటగిరిలో మంగళవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. జాతర కార్యక్రమంలో భాగంగా వేకువజామున అమ్మవారి శిరస్సును ఊరేగించి నడివీధిలో కొలువుదీర్చారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలి, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు అమ్మవారికి పూజలు చేసి దర్శించుకున్నారు. అమ్మవారిని బుధవారం రాత్రి జలప్రవేశానికి తరలించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై కళాకారుల బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. బయట వ్యక్తులతో అక్రమ సంబంధాలు పెట్టుకోకుండా నియంత్రించుకోవాలని సూచించారు. ఎయిడ్స్‌ను నివారించేందుకు వైద్యపరమైన వ్యాక్సిన్ లేదని నివారణే దీనికి అందుబాటులో ఉన్న టీకా అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలసూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం



నగదు విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని అన్నదాన ట్రస్టుకు మంగళవారం ఓ దాత విరాళం అందించారు. కృష్ణా జిల్లాకు చెందిన శ్రాణి, సుధ రూ. ఒక లక్ష నగదును విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వారికి ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదం అందించారు.

పల్లెలోనే వైద్య సేవలు



వైద్య సేవలు అందజేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: పల్లెల్లోనే ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందిస్తున్నామని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత తెలిపారు. కుప్పిగానిపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి నడవలేని పరిస్థితిలో ఉన్న వారందరికీ వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం మధుమేహం, బీపీ, గర్భిణులు, బాలింతలకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ప్రతి వారం బుధ, శనివారాల్లో ఆశా వర్కర్లు గర్భిణులకు ప్రత్యేకంగా ఇంటివద్దకు వెళ్లి వారి వివరాలను సేకరించి వైద్యం అందజేయనున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది శిల్ప, శశి, అశ్విని, ప్రవీణ్ పాల్గొన్నారు.

మళ్లీ హైరోడ్డు పనులు మొదలు



అడ్డంకులను తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: నగరంలో మంగళవారం మళ్లీ హైరోడ్ విస్తరణకు పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఇప్పటివరకు ప్రభుత్వ స్థలాల్లో సమస్యలను తొలగించిన నగరపాలక సంస్థ, మరో అడుగు ముందుకు వేసింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర నేతృత్వంలో విస్తరణ పనులు మళ్లీ మొదలయ్యాయి. ఇందులో భాగంగా కట్టమంచి మార్గంలో విస్తరణ పనులను ప్రారంభించారు. జేసీబీలతో విస్తరణ రోడ్డుకు సరిపడా స్థలానికి ఉన్న అడ్డంకులను తొలగిస్తున్నారు. ఈ పనులను నగర మేయర్ అముద పర్యవేక్షించారు.

ఆర్టీసీ డిస్పెన్సరీ తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న డిస్పెన్సరీని ఎండీ ద్వారక తిరుమలరావు మంగళవారం తనిఖీ చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. తర్వాత బస్టాండును సందర్శించారు. ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ అప్పలరాజు, ఏడీఈ చెంగల్‌రెడ్డి, డీపీటీఓ జగదీష్ తదితరులున్నారు.

అలంకారప్రాయం

యాదమరి మండలంలోని పలు గ్రామాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం లక్షల రూపాయలు ప్రజాధనాన్ని వెచ్చించి బస్‌షెల్టర్లను నిర్మించారు. అయితే ప్రస్తుతం వాటిని పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. కొన్ని బస్‌షెల్టర్లను మందు బాబుల అడ్డాగా మారాయి. జోడిచింతల వద్ద ఉన్న బస్ షెల్టర్‌లో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ముద్దు రామాపురం వద్ద బస్ షెల్టర్‌లో స్థానిక వ్యాపారులు శీతల పానీయాల ట్రేలను, తోపుడు బండ్లు ఉంచుతున్నారు. కానికాపురం వద్ద ఉన్న షెల్టర్ మందు బాబులకు అడ్డాగా మారుతోంది. మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని చిన్నిరెడ్డిపల్లి క్రాస్ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో దిమ్మెలు కూడా లేవు.

– యాదమరి



చిన్నిరెడ్డిపల్లి బస్‌షెల్టర్



కనికాపురం బస్ షెల్టర్



ముద్దురామాపురం బస్ షెల్టర్

పచ్చ గడ్డి.. పాల దిగుబడి



గొల్లపల్లె వద్ద పాడిపశువుల కోసం సాగు చేసిన పచ్చగడ్డి

- పాడి పశువులకు పచ్చిమేత మేలు
- సమగ్ర పశుపోషణపై రైతులు అవగాహన పెంచుకోవాలి

బంగారుపాళెం: పశువుల పోషణ రైతులకు పెను భారమైన నేపథ్యంలో సమగ్ర పశుపోషణ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. తద్వారా పశువు ఆరోగ్యకరమైన జీవనం సాగించగలదని, పచ్చిరొట్ట మేతల వల్ల పాలదిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. వేసవి తరువాత వచ్చే వర్షాకాలం ప్రారంభంలో పశువుల మేతకు కొరత లేకుండా చూసుకోవాలి. పచ్చి మేతల వలన పశువులకు పోషక విలువలు అందుతాయి.

పచ్చిమేత వల్ల ప్రయోజనాలు

ఎండు మేత పశువులకు కడుపు నింపడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. పచ్చిమేత కొరత రాకుండా చేసుకోవడానికి రైతు తన పొలంలో పదోవంతు భూమిలో పశుగ్రాసాలు పెంచుకోవాలి. పచ్చి మేతల్లో అధిక పోషకాలు, విటమిన్లు ఎక్కువగా ఉండటం వలన ఎదకు త్వరగా రావడానికి, పాల ఉత్పత్తి అధికంగా పెరగడానికి ఎంతగానో ఉపయోగపడుతాయి. పచ్చి మేతల్లో కాయజాతి, కాయ జాతి కానివి ఉంటాయి. కాయ జాతిలో చిరుధాన్యాలు, గడ్డి రకాలు ఉంటాయి. కాయ జాతి కాని రకాల్లో పశువులకు కావాల్సిన శక్తినివ్వడానికి, కాయజాతి రకాలు మాంసకృత్తుల వృద్ధికి పనికి వస్తాయి. మేలు జాతి గడ్డి రకాలను ఎంచుకుని రైతులు పెంచుకోవాలి. పచ్చగడ్డిలో 70 శాతం, ఎండుగడ్డిలో 30 శాతం పోషక విలువలు ఉంటాయి.

ధాన్యపు జాతి రకాలు

హైబ్రీడ్ జొన్న, మొక్కజొన్న ఉన్నాయి. హైబ్రీడ్ జొన్నలో పీసీ పూచాచారి, 23, ఎంపీ చారి, ఎస్ఎస్‌జీ 53, ఎస్ఎఫ్‌జీ 59 మూడు రకాలు ఎంపిక చేసుకోవాలి. మొదటి దశ కోత 60 రోజులకు వస్తుంది. ఎకరాకు 30 నుంచి 35 టన్నుల దిగుబడి వస్తుంది. మూడు కోతలు, ప్రతి 40 రోజులకు ఒక కోత చొప్పున లభిస్తుంది.

- మొక్కజొన్నలో ఆఫ్రికన్‌టాల్ లేదా గంగ, హైబ్రీడ్ ఎఫ్, విజయ్ కిసాన్ రకాలు ఉన్నాయి. మొదటి కోత 60 నుంచి 70 రోజులకు వస్తుంది. 20 నుంచి 23 టన్నుల దిగుబడి లభిస్తుంది. మూడు కోతలు వస్తుంది.

కాయజాతి పచ్చిమేతలు

అలసందలో యూపీసీ 5236, ఈసీ 4216 రకం, ఐసీ 4216 రకం, రష్యన్ అలసంద రకాలు మంచివి. ఈ రకం 70 రోజులకు కోతకు వస్తుంది. పచ్చిమేత 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. ఒక కోత మాత్రమే వస్తుంది.

- లూసర్న్ రకంలో ఆనంద్ 2, ఆర్ఎల్ 52, కామ్ 2, ఆర్ఎల్ 58 రకాలు ఉన్నాయి. మొదటి కోత 60 రోజులకు వస్తుంది. పచ్చిమేత 20 నుంచి 25 టన్నులు ఎకరాకు దిగుబడి లభిస్తుంది. ప్రతి 30 రోజులకు ఒకసారి చొప్పున 8 కోతల వరకు వస్తుంది.
- పిల్లిపెసర మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది.
- జనుము మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 50 శాతం పూత దశలో కోయాలి. ఒకే కోత ఉంటుంది. 7 నుంచి 9 టన్నులు దిగుబడి లభిస్తుంది.

మేలు జాతి గడ్డి రకాలను పెంచాలి

రైతులు మేలు జాతి గడ్డి రకాలను పెంచుకోవాలి. తమకున్న పొలంలో పదో వంతు గడ్డి సాగు చేయడం వలన పశుగ్రాసం కొరత ఉండదు. మేలు జాతి గడ్డి తినడం వలన పశువులు అధిక పాలను ఇవ్వడం ద్వారా రైతులకు లాభాలు బాగుంటాయి.

– డాక్టర్ షేక్‌ఆసీఫ్, ఏడీ, బంగారుపాళెం

గడ్డిజాతుల్లో మేలు రకాలు

నేపియర్: నేపియర్ బజ్రా21, ఏపీబీఎస్1, కో1, కో2, కో4 వంటివి ఎంపిక చేసుకోవాలి. మొదటి కోత కణుపులు నాటిన తరువాత 60 నుంచి 75 రోజుల కాల వ్యవధిలో లేదా ప్రతి 40 రోజులకోసారి సంవత్సరానికి 5 నుంచి 6 కోతలు కోయవచ్చు. 70 నుంచి 80 టన్నులు దిగుబడి లభిస్తుంది.

సారా గడ్డి జాతి:
నాటిన 75 నుంచి 80 రోజులకు వస్తుంది.30 నుంచి 35 టన్నుల దిగుబడి లభిస్తుంది. ఎకరాకు ప్రతి 40 రోజులకు ఒకసారి కోతకు వస్తుంది 6 కోతలు కోయవచ్చు.

గిన్ని గడ్డి రకం:
పీపీజీ14, హమిల్, మాకుని, కలోనియన్ జాతులు మంచివి. ఈ రకాలు నాటిన 60 నుంచి 70 రోజుల వ్యవధిలో మొదటి కోతకు వస్తాయి. ఏడాదికి 7 కోతలు వస్తాయి. 30 నుంచి 35 టన్నుల దిగుబడి లభిస్తుంది.

ఒకేచోట మూడేళ్లు పనిచేసిన వారికి బదిలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : వైద్య ఆరోగ్య, విధాన పరిషత్‌లో బదిలీల్లో అవినీతికి చెక్ పెట్టేలా వైద్య ఆరోగ్యశాఖ వర్గంలో చర్చలు మొదలయ్యాయి. క్షేత్ర స్థాయిలో డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ కార్యాలయాలతో పాటు ఆసుపత్రుల సూపరింటెండెంట్ల కార్యాలయాల్లో పలు సంవత్సరాలుగా పనిచేస్తున్న కింది స్థాయి, పాలన సిబ్బందిపై పలు అవినీతి, అక్రమాల ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక శాఖ విధానాల ప్రకారం ఒకే చోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలన్న నిబంధనను సడలిస్తూ ఒకే చోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన పాలన సిబ్బందిని బదిలీ చేయాలని శాఖ నిర్ణయించింది.

ఘనంగా మహా కుంభాభిషేకం



కుంభాభిషేక పూజల్లో అర్చకులు, అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వీరాంజనేయ స్వామి నూతన ఆలయ మహా కుంభాభిషేకం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు సాయంత్రం పుణ్యాహవాచనం, రక్షాబంధనం, వాస్తు పూజ, వాస్తు హోమం, పర్యగ్నికరణం, పంచగవ్య, సంప్రోక్షణం, తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈవో పెంచల కిషోర్, దాత అనిల్ కుమార్, దేవస్థానం మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

సమతులాహారంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గుడిపాల: విద్యార్థులు సమతులాహారం తీసుకుని శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఏఎన్ఎంలు జబసెల్వి, సరస్వతి అన్నారు. వారు మంగళవారం పేయనపల్లె, పశుమందలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, మహిళలపై అఘాయిత్యాలు, నేరాలను అరికట్టే దిశగా అవగాహన పెంచాలన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగికదాడులు, నేరాలు, అఘాయిత్యాల సంబంధిత కేసుల నమోదు శాతాన్ని 0 స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా వెలుగుతూ విలువలను పెంపొందించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కిశోర బాలికలపై చుట్టూ ఉన్న వారి ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఈ వయసు బాలికలకు శారీరక, మానసిక స్థితిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుందరేష్, మహిళా పోలీస్ పావని పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం



మహిళకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: వృద్ధులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని బాపినాయుడుపల్లెలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 23 మందికి వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, మహిళలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. వృద్ధాప్యంలో వృద్ధులు మంచి పౌష్టికాహారం తీసుకొని విశ్రాంతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు



భద్రకాళమ్మకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

గుడిపాల: మండలంలోని నరహరిపేట సమీపంలో ఉన్న భద్రకాళమ్మ, బొమ్మసముద్రం గ్రామంలోని దుర్గాలమ్మ దేవాలయంలో మంగళవారం అమావాస్య పూజలు చేశారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం నిర్వహించారు. భద్రకాళమ్మ వద్ద అమ్మవారిని ఉయ్యాల సేవ నిర్వహించారు. భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. అన్నదానం చేశారు.

రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ

గుడిపాల: నిత్యావసర సరుకులు జూన్ 1వ తేదీ నుంచి రేషన్‌షాపుల ద్వారానే సరఫరా చేయాలని, ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ జయంతి డీలర్లకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతిరోజు ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 వరకు రేషన్‌షాపులు తెరిచి ఉంచాలని డీలర్లను ఆదేశించారు. 65 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐ రమాసాయి పాల్గొన్నారు.

బంగారుపాళెం: రేషన్‌షాపుల ద్వారా అందించనున్న నిత్యవసర సరుకులను డీలర్లు లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రేషన్ సరుకుల పంపిణీపై డీలర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీలర్ల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్లు అందజేత




చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం కొత్త వెర్షన్‌తో వచ్చిన ఎల్-1 ఈ పాస్ మిషన్లను ఎరువుల దుకాణదారులకు అందజేశారు. రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ద్వారా ప్రభుత్వం డీలర్లకు అందిస్తోంది. జిల్లా వ్యాపంగా ఎక్కువగా వ్యాపారం చేసే 225 మంది డీలర్లను గుర్తించి ఈ మిషన్లను అందజేశారు. తొలుత వాటిని రిజిస్ట్రేషన్ చేయించి తర్వాత డీలర్లకు పంపిణీ చేశారు.

మమ్మేలు తల్లీ.. గంగమ్మ



అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న మహిళలు



విశేషాలంకరణలో పాలేటమ్మ

ఐరాల: మండల కేంద్రంలో వెలసిన గ్రామదేవత శ్రీ పాలేటమ్మ గంగ జాతర మంగళవారం ఆలయ వంశపార్యంపర ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమైంది. వేకువజామున ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో అమ్మవారి ప్రతిమ కొలువుదీర్చారు. ఉదయం 6 గంటలకు అమ్మవారి తెర తీసి, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి విశ్వరూప దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహం, ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంలోని వీధులను వేపాకు తోరణాలతో అలంకరించారు. వీఎస్.అగ్రహారం నుంచి బజారువీధి వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రత్యేక వాయిద్యాల నడుమ మహిళలు అంబలితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజారులు అమ్మవారికి అంబలిని నైవేద్యంగా సమర్పించి భక్తులకు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహిళలు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు పిండి దీపాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి జాతర సందర్భంగా భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గంగజాతర సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పూజారి మోహన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా గంగజాతర

గుడిపాల: మండలంలోని కుప్పిగానిపల్లెలో మంగళవారం ఘనంగా గంగజాతరను గ్రామస్తులు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి అంబలిపోసి మొక్కులను చెల్లించుకున్నారు. సాయంత్రం పొంగళ్లు పెట్టారు. జాతరలో మాజీ సైనికులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.





ఐరాల: కొలువు దీరిన గంగమ్మను దర్శించుకున్న మోహన్‌రెడ్డి





గుడిపాల: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు, ఊరేగింపుగా అంబలి తీసుకెళ్తున్న గ్రామస్తులు